# రోడ్ల అనుసంధానం, అభివృద్ధిలో

# నంబర్‌వన్‌గా తెలంగాణ

- **ఎన్‌హెచ్‌ల నిడివి 1000 కి.మీ. పెంపు కోరాం**
- **కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం చర్చిస్తారు: తుమ్మల**

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రహదారుల అనుసంధానం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 'నేషనల్ అకాడమీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(నాస్‌డాక్)'లో సోమవారం ఆయన ఆర్ అండ్ బీ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, రోడ్ నెట్‌వర్క్‌లో 2003-04లో దేశంలో గుజరాత్ తర్వాత మన రాష్ట్రమే ఉండేదని, ఇప్పుడు పదో స్థానానికి దిగజారిందని అన్నారు. మన రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకువచ్చి, దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసుకోవాలంటే కచ్చితంగా రోడ్ కనెక్టివిటీని పెంచాల్సి ఉందన్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలతో రహదారులను మరింత విస్తృతంగా అనుసంధానించాల్సి ఉంటుందన్నారు. తెలంగాణకు పోర్టులు లేనందున సమీపంలోని మచిలీపట్నం, కాకినాడ పోర్టులతో అనుసంధానించేలా రహదారి వ్యవస్థను మెరుగుపర్చుకోవాల్సి ఉందన్నారు. మిగిలిపోయిన రహదారుల నిర్మాణానికి ఇప్పటికే రూ.4000 కోట్లతో అనుమతులు ఇచ్చామని, నూతనంగా మరో రూ.1,400 కోట్లతో అనుమతులు ఇవ్వనున్నామని వివరించారు. రాష్ట్రంలో 2,700 కిలో మీటర్ల మేర జాతీయ రహదారుల నిడివి ఉందని, మరో 2,000 కిలోమీటర్ల మేర విస్తరణకు అనుమతి ఇవ్వాలంటూ కేంద్రప్రభుత్వాన్ని కోరామని, ఈ ఏడాది కనీసం వెయ్యి కిలోమీటర్ల మేరకైనా ఇవ్వాలని అభ్యర్థించడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయకు ప్రతిపాదనలు ఇచ్చామని, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందన్నారు. రెండు మూడు రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కేంద్ర రోడ్డు రవాణ, భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించనున్నారని మంత్రి తుమ్మల తెలిపారు. హైదరాబాద్‌లో 45 అత్యంత ట్రాఫిక్ ఉండే జంక్షన్లను గుర్తించామని, వీటిని ట్రాఫిక్ రహిత జంక్షన్లుగా మార్చడానికి ప్రణాళిక రూపొందించామని, తొలుత వరంగల్ జిల్లా కాజీపేటలో సిగ్నల్స్ అవసరం లేని జంక్షన్‌ను నిర్మిస్తామని తెలిపారు. అమలు సాధ్యం కాని హామీలిస్తున్నామని టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలపై.. మంత్రి ఘాటుగా స్పందించారు. నిర్వేదంతో, వైరాగ్యంతో అలా మాట్లాడుతుంటారని.. పిచ్చోళ్లు, చిల్లర మాటల మనుషుల గురించి మాట్లాడుకోవడం అవసరమా అని ప్రశ్నించారు.



**న్యాక్‌లో జరిగిన సమావేశంలో ఆర్‌అండ్‌బీ కార్యదర్శి సునీల్ శర్మతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల**

